సీరియల్

ప్రేమ సముద్రముకు వేస్తే బ్రిడ్జ్

వసుంధర

(మొదటి భాగము)

"అందరూ సిద్ధంగా వుండండి. మీమీ పొజిషన్లు ఆడ్జస్టు చేసుకోండి. ఎక్కడా అలికిడి కానీకండి. ఏ క్షణంలోనైనా వాడు రావచ్చు—"

అన్నాడు ఇన్‌స్పెక్టర్ రఘునాథ్ నుదుటికి పట్టిన చెమటను తుడుచుకుంటూ.

ఆ సమయంలో అక్కడ ఎండ లేదు. కనీసం ఉక్కగా కూడా లేదు. చల్లని గాలి మెల్లగా వీస్తున్న ఆ సమయంలో

రఘునాథ్ కు చెమటపట్టడానికి అతడి ఆలోచనలు కారణం. ఆ ఆలోచనల్లో గురువులు వున్నాడు.

గురువుల్ని గజదొంగ అనాలో, బందిపోటు అనాలో, హంతకుడనాలో చెప్పడం కష్టం. వాడు అన్ని రకాల పనులూ చేశాడు. ఏమిచేసినా ఎంతో తెలివిగా చేస్తాడు. చేసిందాని కెప్పుడూ విచారింపడు. విచారించవలసి వచ్చేలా ఏపనీ చేయడు.

గురువులు ఎప్పుడు ఎక్కడ ఏ నేరం చేయబోతున్నాడో ఎవ్వరూ చెప్పలేరు. ఈవేళ హైదరాబాదులో వుంటే రేపు మదరాసులో వుంటాడు. ఇంకోరోజు ఢిల్లీలో వుంటాడు. వాడు చాలా భాషలు ధారాళంగా మాట్లాడగలడు. అయితే వాడు తెలుగువాడన్నది నిర్వివాదాంశం.

నేరాన్ని కళగా గుర్తిస్తే ఆ కళలో అత్యున్నత స్థాయిలో పరిణతి పొందిన గురువుల్ని చూసి తెలుగుదేశం గర్వపడక తప్పదు. ఎందరో రాజకీయనాయకుల్నీ, విద్యావేత్తల్నీ, శాస్త్రజ్ఞుల్నీ, బాబాలనూ తయారుచేసిన తెలుగుదేశం సర్వకళల్లోనూ తనకుగల ఆధిపత్యాన్ని నిరూపించుకోవడం కోసం గురువుల్ని సృష్టించింది.

వేషాలు వేయడంలోనూ, మనుషుల్ని అనుకరించడంలోనూ గురువులికి గురువులే సాటి. వాడి తత్వ మెలాంటిదో తెలియదుకానీ ఓ పట్టాన హత్యకు తలపడడు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే వాడు హత్యలు చేస్తాడు. కానీ తప్పనిసరి పరిస్థితులు చాలా వచ్చాయి వాడికి.

గురువులకు అనుచరులు లేరు. అదే వాణ్నింత కాలమూ రక్షిస్తూ వచ్చింది. ఇవ్వాళ్ళకు వాడికి ఓ అనుచరుడి అవసరం కలిగింది. అదే వాడికి ప్రాణాంతకమూ అయింది.

విశ్వేశ్వర్రావు గారిల్లు దోచడానికి వాడు నిశ్చయించు

కున్నప్పుడు మరో మనిషి అవసరముంటుందని వాడికి అనిపించింది. అందుకని వాడు రంగారావును ఎన్ను కున్నాడు.

రంగారావుకు తలిదండ్రులు లేరు. ఇల్లూ వాకిలీ లేదు. సామాన్లుమోసి డబ్బు సంపాదించుకుంటూంటాడు. వాడి నిద్ర బస్‌స్టాపులో.

అలాంటివాడికి ధనలోభం వుంటుందని గురువులుకు తెలుసును. వాడికి పదివేల రూపాయలు ఆశ చూపించాడు. పదిహేనేళ్ళ రంగారావు ఆ డబ్బుగురించి వినగానే చాలా ఆత్రుత చెందాడు. గురువులు తన పథకం వివరించాడు.

విశ్వేశ్వర్రావుగారిలో రవంత దయాగుణం వుంది. దాన్నాధారంగా చేసుకుని రంగారావును గురువులు ఆయన ఇంట్లో ప్రవేశపెడతాడు. వాడా ఇంట్లో పనిచేస్తూ గురువులుకు అనుపానులన్నీ చెప్పాలి. రంగారావు అంగీక రించాడు.

గురువులు, రంగారావును తీసుకుని విశ్వేశ్వర్రావు ఇంటికి వెళ్ళి ఆయన ముందు దీనంగా విలపించి తన స్నేహితుడి కొడుకైన రంగారావుకో దారి చూపించమని వేడుకున్నాడు.

“ఏం చేయమంటావ్?” అనడిగాడు విశ్వేశ్వర్రావు.

“మీ కేం తోస్తే అదే!”

విశ్వేశ్వర్రావు, రంగారావును ఇంట్లో పనికి కుదుర్చు కున్నాడు. ఓవారం రోజులుపాటు ఆయన రంగారావును రకరకాలుగా పరీక్షించాడు. ఎక్కడైనా డబ్బుగానీ, ఖరీదైన వస్తువుగానీ మరిచిపోతే క్షణాలమీద తెచ్చి ఇచ్చేసేవాడు రంగారావు. ఎంత కష్టమైన పని చెప్పినా

చేయడానికి ప్రయత్నించడమే కానీ చేయలేనని అనే వాడు కాదు. వాడి చలాకీతనం అమితకాలంలోనే విశ్వేశ్వర్రావును ఆకర్షించింది.

విశ్వేశ్వర్రావుకు బాగా డబ్బుంది. చాలావరకూ బ్లాక్ మనీ అని అంతా చెప్పుకుంటారు. చాలా స్మగ్లింగు వ్యవహారాలలోనూ, వ్యభిచార గృహాలలోనూ ఆయనకు సంబంధముందని లోపాయికారీగా అనుకుంటూంటారు. అయితే యేం? ఆయన సమాజంలో పెద్దమనిషిగా చలామణీ అవుతున్నవాడు. ఒక్క రాత్రి ఆయన ఇల్లు కొల్లగొడితే లక్షలు దొరకవచ్చునని గురువులు అనుకుంటున్నాడు.

నిజం చెప్పాలంటే గురువులుకు దొంగతనాలమీద విరక్తికలిగి విశ్వేశ్వర్రావు నెన్నుకున్నాడు. ఆ ఇంట్లో సంపాదించిన డబ్బుతో జీవితకాలం కాలుమీద కాలు వేసుకుని హాయిగా గడిపేయవచ్చునని వాడి నమ్మకం.

అందుకే వాడు విశ్వేశ్వర్రావుమీద చాలా ఆశలు పెట్టుకున్నాడు. ప్రమాదమని తెలిసుండీ అనుచరుణ్ని ఎన్నుకున్నాడు.

రంగారావు అటు విశ్వేశ్వర్రావుకీ ఇటు గురువులకూ కూడా నమ్మకంగా వుంటున్నాడు. అయితే విశ్వేశ్వర్రావు విషయాలు గురువులుకు తెలుస్తున్నాయి కానీ, గురువులు విషయాలు విశ్వేశ్వర్రావుకు తెలియవు. విశ్వేశ్వర్రావు నెల్లాళ్ళు పనిచేస్తే భోజనంపెట్టి పాతికరూపాయలిస్తాడు. గురువులు ఒక్కసారిగా పదివేలిస్తాడు. ఆ తేడా ఎలాగూ వుంటుంది మరి!

విశ్వేశ్వర్రావు ఇంటికి పెద్దగా రక్షణ ఏర్పాట్లు లేవు. ఆయన ఇల్లు చాలా సింపుల్‌గా వుంటుంది. ఆయన పడు

కనే గదిలో ఓ ఇనప్పెట్టె వుంటుంది. డబ్బు అందులోనే దాస్తాడాయన.

రంగారావు నక్కి నక్కి ఓపర్యాయం కనిపెట్టిన విశేషమేమిటంటే ఆ ఇనప్పెట్టెలో ఓ రహస్యపు అర వుంది. ఎక్కువ డబ్బు నాయన అందులోనే దాస్తాడు. వంద రూపాయల నోట్లకట్టలు అందులో ఎన్నున్నాయో!

రంగారావు సరైన సమయం చూసి గురువులుకు వార్త నందించాడు.

ఆ రోజు విశ్వేశ్వర్రావు ఒక్కడూ ఇంట్లో వున్నాడు. ఆయనకు సాయంగా రంగారావొక్కడే వున్నాడు. అర్థరాత్రి పన్నెండు గంటలకు గురువులూ ఇంట ప్రవేశించడానికి రంగారావు సాయం చేశాడు.

గురువులు, విశ్వేశ్వర్రావుకు స్పృహ తప్పించాడు. రంగారావు చెప్పిన సూచనల మేరకు తాళాలు తీసి ఇనప్పెట్టె తెరచి రహస్యపు అరను గుర్తించాడు. అందులో మొత్తం నాలుగు లక్షలకు పైగా వుంది.

గురువులు గబగబా అందులోని డబ్బు తన బ్రీఫ్ కేసులోకి తరలించాడు. సరిగ్గా పదివేలు లెక్కపెట్టి రంగారావుకు యిచ్చాడు. ఉత్సాహంగా ఇనప్పెట్టె మూసేసి తాళాలు యథాస్థానంలో వుంచేసి—"ఈ డబ్బు నీకు తోచిన విధంగా ఖర్చుపెట్టుకో-పోలీసులకు విశ్వేశ్వర్రావీ విషయాన్ని చెప్పుకోడు. ఆయన ఎన్ని ప్రశ్నలు వేసినా అమాయకత్వాన్ని నటించు..." అన్నాడు.

ఆ డబ్బును చూస్తూనే రంగారావు కళ్ళు మెరిశాయి. కానీ అంతడబ్బు ఎక్కడ దాచుకోవాలో వాడికి తెలియలేదు. విశ్వేశ్వర్రావుకు అనుమానం వస్తే తననేం చేస్తాడోనని కూడా వాడు భయపడుతున్నాడు.

"నాకు భయంగా వుంది. నేనూ నీతోనే వచ్చేస్తాను" అన్నాడు రంగారావు.

"మన ఒప్పందం నేను నీకు పని చేసివ్వడంవరకే. ఆ తర్వాత నీ దారి నీది. నా దారి నాది. విశ్వేశ్వర్రావుకు డబ్బు పోయిన సంగతి తెలియడానికి చాలాకాలం పట్టవచ్చు. ఆయన నిన్ను అనుమానించడానికి ఆస్కారం లేదు. నువ్వు మామూలుగా నీ పనిచేసుకుపో—" అన్నాడు గురువులు.

రంగారావు చూస్తూండగానే గురువులు అక్కణ్ణించి కదలి గుమ్మందాకా వెళ్ళి ఆగిపోయాడు. అక్కడ ఒక మనిషి నిలబడి వున్నాడు. అతడి రెండు చేతుల్లోనూ పిస్తోళ్ళున్నాయి. అవి గురువులు వైపే గురిపెట్టబడి వున్నాయి.

ఇటువంటి పరిణామాన్ని గురువులు ఊహించలేదు. ఈ ఇంట్లో విశ్వేశ్వర్రావు కాక ఇంకో మనిషి వున్నాడని అతను అనుకోలేదు. అయినా ఇలాంటి సమాచారం కోసమే తను రంగారావుని ఇంట్లో వుంచాడు. కానీ ఇప్పుడేమనుకుని ఏం ప్రయోజనం?

"ఎవర్నువ్వు?" అన్నాడు గురువులు. అవతలి వ్యక్తి కూడా తనలాంటి దొంగే అయితే వాడి పని సులువైపోతోంది. ఏ గొడవ లేకుండా చెరిసగం వాటా తీసుకోవచ్చు.

"విశ్వేశ్వర్రావుగారు నిశ్చింతగా నిద్రపోతున్నారంటే నా వల్లనే. నాకు తెలియకుండా చీమకూడా ఈ ఇంట్లోకి రాలేదు. ఈ ఇంట్లోంచి పోలేదు." అన్నాడు ఆ మనిషి.

"నేను చీమను కాదు. అందుకే నీకు తెలియకుండా లోపలకు వచ్చాను..."

ఆ మనిషి పకపకా నవ్వాడు. "నువ్వు రావడం నేను చూశాను. నువ్వు చేస్తున్న ప్రతిపనీ చూశాను. ఈ ఇంట్లోకి రావడానికి సాహసించావంటే నీకేదో ధైర్యం వుండివుండాలి. ఆ ధైర్యాన్ని తెలుసుకునేందుకు ఇంత వరకూ ఆగాను. రంగారావు నమ్మకద్రోహి అని తెలుసుకున్నాను. వీళ్ళిద్దర్నీ విశ్వేశ్వర్రావుగారికి పట్టిస్తాను. ఏం చేసుకుంటారో ఆయన యిష్టం__"

గురువులు పెద్దగా చలించలేదు. "రంగారావు కూడా ఈ ఇంట్లో పనివాడు. అతనికి పదివేలిచ్చాను. నాకు సాయపడ్డాడు. నువ్వూ ఈ ఇంట్లో పనివాడివే. నీకో లక్ష ఇస్తాను నా దారికి అడ్డుతొలిగితే..."

ఆ మనిషి ముఖం ఎర్రబడింది__"ఈ ప్రతాప్ శరీరంలోని అణువణువూ విశ్వేశ్వర్రావు కోసమే! లక్షలకు లొంగే మనిషి కాదు వీడు..."

"లక్షలకు లొంగనప్పుడు ప్రాణాలు పోగొట్టుకోవాల్సి వుంటుందేమో!"

"ప్రాణాలు తీయడంలో స్పెషల్ డిప్లొమా వుంది నాకు. నేను ఇష్టపడితే తప్ప నా ప్రాణాల్ని దేవుడు కూడా తీయలేడు..." అన్నాడు ప్రతాప్.

"సరే_నీ గురించి నువ్వు చెప్పుకున్నావ్. మరి నా గురించి నేను చెప్పుకోనా? నా పేరు గురువులు..." అన్నాడు గురువులు.

అటు రంగారావు, ఇటు ప్రతాప్ కూడా ఆ మాట విని ఉలిక్కిపడ్డారు. ఆ ఒక్కక్షణం చాలు గురువులుకు. వాడు మెరుపు వేగంతో ప్రతాప్‌ని సమీపించి రెండు చేతులమీదా ఒకే పర్యాయం దెబ్బలు వేశాడు. ప్రతాప్ చేతిలోని రివాల్వర్లు క్రిందపడ్డాయి. ప్రతాప్ యింకా

తెరుకునేలోగా గురువులు మొలలోంచి కత్తి తీశాడు. కత్తి బలంగా ప్రతాప్ గుండెల్లో దిగబడింది. కీచుగా అరిచి క్రిందపడ్డాడు ప్రతాప్. వెంటనే అతడి ప్రాణం పోయింది.

తన కళ్ళముందు జరిగిన ఈ ఘోరం చూసి రంగారావు వణికిపోయాడు. గురువులు పేరు వాడు విన్నాడు. వాడొక మహా భయంకరమైన వ్యక్తి అని రంగారావుకు తెలుసు. అయితే గురువులు చేసే ఘోరాలెంత భయంకరంగా వుంటాయో వాడిప్పుడు ప్రత్యక్షంగా చూశాడు.

గురువులు మళ్ళీ రంగారావు దగ్గరకు వచ్చి—"భయపడ్డావా?" అన్నాడు. రంగారావు అవునన్నట్లు తలూపాడు.

"భయపడకు. నేను నిన్నేమీ చేయను. హత్య చేయడం నా కిష్టముండదు. కానీ ఒక్కోసారి తప్పనిసరి అవుతూ ఉంటుంది. ఈ ప్రతాప్‌కి నీగురించీ నాగురించీ తెలిసిపోయింది. వీడు బ్రతికుంటే నీకూ నాకూ ప్రమాదమే! అందుకే చంపేశాను. అయినా వీడీ ఇంట్లో వున్నట్లు నువ్వు నాకెందుకు చెప్పలేదు?" అన్నాడు గురువులు.

"నాకు నిజంగా వీడి సంగతి తెలియదు. వీణ్ణెప్పుడూ చూడలేదు నేను. బహుశా ఈ ఇంట్లో రహస్యంగా ఉంటున్నాడేమో—" అన్నాడు రంగారావు

"అయుండొచ్చు. విశ్వేశ్వరరావు సామాన్యుడు కాడు. ఈ ఇంటికి రక్షణగా వీడిని వుంచివుంటాడు. దగ్గరున్నది నల్లధనం కాబట్టి కాపలా మనిషిని బహిరంగంగా కాక రహస్యంగా ఉంచుతున్నాడన్నమాట. నువ్విక్కడే నిశ్చింతగా పడుకో. ఆయనకు స్పృహవచ్చి లేపితే నువ్వు కూడా లే! ఏమీ తెలియనట్లు నటించు..." అన్నాడు గురువులు.

రంగారావు భయంభయంగా తెలుపాడు. గురువులు ముందుకు వెళ్ళి ప్రతాప్ దగ్గర ఆగాడు.

అతడి కళ్ళు భయంకరంగా చూస్తున్నాయి. ఓ పర్యాయం రంగారావు వంక చూసి ఆ రెప్పలు మూశాడు గురువులు. తర్వాత ప్రతాప్ గుండెల్లోని కత్తిని బయటకు లాగి తన జేబులోంచి ఒక నాప్‌కిన్ తీసి దానికి చుట్ట పెట్టి మళ్ళీ మలలో దోపుకున్నాడు. మరో పర్యాయం రంగారావును హెచ్చరించి తను అక్కణ్ణించి కదిలాడు.

అయితే రంగారావుక అక్కడ చాలా భయంగా వుంది. విశ్వేశ్వర్రావు స్పృహ లేకుండా ఉన్నాడు. ఆయన ఇనప్పెట్టె ఖాళీగా ఉంద. అక్కడ ప్రతాప్ అనబడే ఓ మనిషి చచ్చిపడి ఉన్నాడు. ఆ హత్య చేసిన మనిషి అప్పుడే అక్కణ్నించి వెళ్ళిపోయాడు.

రంగారావు మనసు అతన్ని హెచ్చరిస్తోంది. వాడి జేబులో పదివేల రూపాయలున్నాయి. ఆ డబ్బు అర్జంటుగా ఎక్కడైనా దాచాలి. అక్కడే ఉంటే చాలా ప్రమాదం. అందుకని వాడు కూడా ఇంట్లోంచి బయట పడ్డాడు. బయటపడగానే సందుమలుపు తిరుగుతున్న గురువులు వాడి కళ్ళబడ్డాడు. గురువుల్ని చూస్తూనే రంగారావు బుర్రలో రకరకాల ఆలోచనలు వచ్చాయి.

గురువు లిప్పుడేం చేస్తాడు? ఎక్కడికి వెడతాడు?

రంగారావు ఇప్పుడెలాగూ ప్రమాదంలో వున్నాడు. అనుమానించవలసిన పరిస్థితుల్లో ఇరుక్కున్నాడు వాడు. విశ్వేశ్వర్రావు డబ్బు మాయం, ఆ ఇంట్లో హత్య, రంగారావు జేబులో పదివేలు!

మారు ఆలోచన లేకుండా రంగారావు గురువుల్ని అనుసరించసాగాడు. గురువులు వెనక్కి తిరిగినప్పుడల్లా

పక్కకు తప్పుకుంటూ వాడికి ఏ విధంగానూ అనుమానం కలక్కుండా వుండేలా చూసుకుంటూ గురువులు వెంట బడ్డాడు రంగారావు.

గురువులలా నడుచుకుంటూ ఊరి చివరకు వెళ్ళాడు అక్కడ రోడ్డు పక్కగా దిగి ఓ తోటలోకి వెళ్ళాడు. చుట్టూ చెట్లున్నచోట మధ్యలో ఆగాడు. వాడి బ్రీఫ్ కేసులోంచి ఓ చిన్న గునపం తీశాడు.

రంగారావు చూస్తూండగా అక్కడ ఓ పెద్ద గొయ్యి తిసి అందులో తన బ్రీఫ్ కేసు, మొలలోని కత్తి నేప్ కిన్ తో సహా అందులో పారేసి గొయ్యి కప్పెట్టేశాడు. తర్వాత ఓ చెట్టు దగ్గరకు వెళ్ళి జేబులో వున్న టేపుతీసి ఆ చెట్టు దగ్గర్నుంచి గొయ్యి దగ్గరకున్న దూరం కొలి చాడు. ఓ కాగితంమీద వివరాలు నోట్ చేసుకుని మళ్ళీ అక్కణ్నించి కదిలాడు.

రంగారావు మళ్ళీ గురువుల్ని అనుసరించాడు. గురువులు తిన్నగా రైల్వేస్టేషన్ కు వెళ్ళాడు. మర్నాడు ట్రయిన్లో బొంబాయి వెళ్ళడానికి టికెట్ రిజర్వ్ చేసుకున్నాడు. కాస్త దూరంగా వున్నప్పటికీ గురువులు ప్రయాణం వివ రాలు తెలుసుకునేందుకు ప్రయత్నించాడు రంగారావు.

గురువులు అక్కణ్నించి కదిలేక కౌంటర్లో అడిగి— గురువులు సుబ్బారావు పేరుతో మర్నాటికి బొంబాయికి టికెట్ రిజర్వ్ చేసుకున్నట్లు గ్రహించాడు.

రైల్వేస్టేషనులో టైము మూడున్నరవుతోంది. రంగా రావు బుర్రలో పురుగు దొలుస్తోంది. హఠాత్తుగా వాణ్ని ధైర్యలక్ష్మి కరుణించింది.

గురువులు చెప్పిన ప్రకారం విశ్వేశ్వర్రావు ఇంట్లో వున్నది నల్లధనం. కాపలావాడు ప్రతాప్ రహస్యంగా

వుంటున్నాడు. అందువల్ల ఆయన దొంగతనం గురించి కానీ, హత్య గురించి కానీ పోలీసులకు చెప్పకపోవచ్చు. ఆయనకు తెల్లవారి ఆరేడు గంటలవరకూ స్పృహ రాదని గురువులు అన్నాడు.

విశ్వేశ్వరరావుకు తనమీద తప్పకుండా అనుమానం కలుగుతుంది. తన నాయన చిత్రహింసలు పెట్టవచ్చు. తానిప్పుడు వెనక్కి వెళ్ళి గురువులుదాచిన డబ్బు తీసుకుని వెంటనే స్టేషన్‌కువచ్చి అందుబాట్లోవున్న రైలెక్కి వెళ్లిపోతే తన నెవ్వరూ ఏమీ చేయలేరు. గురువులు బొంబాయి వైపు వెళ్ళాలనుకున్నాడు కాబట్టి తను కలకత్తా వైపు వెళ్ళిపోతే సరిపోతుంది.

ఈ ఊహ రాగానే రంగారావు వెంటనే స్టేషన్ వదిలి పెట్టి ఊరిచివర తోటకు పరుగెత్తాడు. భయమూ, ఆవేశమూ, ఉద్రేకం, సంతోషం, కంగారు వగైరా రకరకాల భావాలతో వాడు అక్కడికి చేరుకున్నాడు. దాపుల్లోవున్న ఓ మొక్క కొమ్మ విరిచి ఆకులు దూశాడు. దాంతో గురువులు దాచిపెట్టిన స్థలంలో తవ్వసాగాడు.

కొద్ది గంటల క్రితమే తవ్వబడిన చోటు కాబట్టి ఆ ప్రాంతం గుర్తుపట్టడానికి పెద్ద కష్టం కాలేదు. అలాగే గొయ్యి తవ్వడానికీ యిబ్బంది కాలేదు.

బ్రీఫ్ కేసూ, కత్తి బయటపడ్డాయి. కత్తిని చూస్తూంటే కొద్ది గంటల క్రితం జరిగిన హత్య గుర్తుకువచ్చి రంగారావు కళ్ళు చెదిరిపోయాయి. కత్తిని మళ్ళీ ఆ గోతిలోకే జారవిడిచాడు వాడు. బ్రీఫ్ కేసు గురించే ఆలోచిస్తున్నాడు వాడు. తను ఆ బ్రీఫ్ కేసు తీసుకుని బయటకు వెళ్ళడం మంచిదా, లేక వీలైనంత డబ్బు తీసుకుని జేబులో కుక్కుకుని అక్కణ్నించి తప్పుకోవడం మంచిదా?

బ్రీఫ్ కేసు తనలాంటి కుర్రాడి చేతిలో వుంటే రకరకాల అనుమానాలకు దారితీస్తుంది. అందువల్ల రంగారావుకు డబ్బు తీసుకోవడమే శ్రేయస్కరమనిపించింది. ఆ ఉద్దేశ్యంతో వాడు బ్రీఫ్ కేసు తెరిచాడు.

"ఎవరున్నువ్వు?" అన్న ప్రశ్న ఒకటి అప్పుడే వాడికి వినిపించి ఉలిక్కిపడి తలెత్తి చూశాడు. వాడి పై ప్రాణాలు పైనే పోయాయి.

ఆ మనిషి ఖాకీదుస్తుల్లో వున్నాడు. తప్పకుండా పోలీసు మనిషై వుంటాడు. రంగారావుకు నోటమాట రాలేదు.

"ఎవరున్నువ్వు? ఇక్కడేం చేస్తున్నావు?" ఆ మనిషి గద్దించాడు.

రంగారావు చటుక్కున లేచి అక్కణ్ణించి పరుగెత్తబోయాడు. అయితే ఆ మనిషి ఓ నిముషంలో వాడిని అందుకుని చేయిపట్టుకుని— "వెధవ్వేషాలు వెయ్యకు. చావు దెబ్బలు తింటావు..." అన్నాడు.

రంగారావు భయంగా—"నాకేమీ తెలియదు..." అన్నాడు.

"తెలియనివి నిన్నడగను. తెలిసినవే చెప్పు..." అన్నాడా మనిషి.

రంగారావుకు తను తప్పించుకోలేనని తెలిసింది.

"రైల్వేస్టేషను దగ్గర నిన్ను చూశాను. నీ జేబు ఎత్తుగా కనబడుతోంది. ఎవరిదైనా జేబు కొట్టేశావేమోననిపించింది నీ ప్రవర్తన చూస్తుంటే. అక్కడే అటకాయించాలనుకున్నాను కానీ నువ్వు కంగారుగా పోతున్నావు. సరే—ఎక్కడకు పోతున్నావో చూద్దామని నీ వెనకే బయల్దేరాను.

కొంతదూరం వెళ్ళాక నువ్వు వెళ్ళేచోటు మామూలుది కాదనిపించింది. దాంతో నిన్ను రహస్యంగా అనుసరించడం ప్రారంభించాను. నేననుసరిస్తూన్నట్లు తెలిస్తే నువ్వు చేరవలసిన చోటుకు వెళ్ళవని అనుమానం వచ్చింది. అందుకే ఇంతవరకూ రహస్యంగా ఆగాను. చూడ్డానికి కుర్రాడిలాగే వున్నా నువ్వు ఏదో హత్య చేసినట్లు నాకను మానంగా వుంది—'' అన్నాడా మనిషి.

రంగారావుకు భయం వేసింది. వాడు గబగబా నిజం చెప్పేశాడు. తన జేబులోని పదివేలుకూడా తీసి చూపించాడు. మొత్తం డబ్బంతా తీసుకుని తనను కరుణించి వదిలిపెట్టమని వేడుకున్నాడు.

ఆ మనిషి నవ్వి ''ఈ కానిస్టేబుల్ కనకయ్యకు డ్యూటీ తర్వాతే ఏదైనా!'' అన్నాడు. ఆ తర్వాత—''నువ్వు చెప్పేదంతా నిజమైతే నీకో మంచి ఉపకారం చేయగలను. గురువులుకోసం పోలీస్ డిపార్ట్‌మెంట్ చాలా కాలంగా గాలిస్తోంది. వాడి గురించిన సమాచారం అందించిన వారికి పదివేల రూపాయల బహుమానంకూడా వుంది. వాణ్ని పట్టుకున్న వారికి యాభైవేల రూపాయల నగదు బహుమతి వుంది. నువ్వు చెప్పినప్రకారం రేపటిలోగా గురువులు ఇక్కడికి తన సామానుకోసం వస్తాడు. గురువులు మాకు దొరికితే నీకు మంచి బహుమానం...'' అన్నాడు కనకయ్య, రంగారావుతో.

బ్రీఫ్ కేసునూ, కత్తినీ అక్కడ మళ్ళీ పాతిపెట్టి, కనకయ్య రంగారావును తీసుకుని పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి ఇన్‌స్పెక్టర్ రఘునాథ్‌కు సమాచారాన్నందించాడు.

రఘునాథ్ అప్పటికప్పుడు విశ్వేశ్వర్రావు ఇంటికి వెళ్ళాడు. అతడు వెళ్ళేసరికి విశ్వేశ్వర్రావుకింకా స్పృహ

రాలేదు. ప్రతాప్ శవం అక్కడే వుంది. రంగారావు ఇచ్చిన సమాచారం చాలావరకూ నిజమేనని అతడు గ్రహించాడు. తర్వాత నెమ్మదిగా విశ్వేశ్వర్రావుకు స్పృహ తెప్పించడానికి ప్రయత్నించాడు.

విశ్వేశ్వర్రావు సులభంగానే మేలుకున్నాడు. రఘునాథ్ చెప్పినదంతా వినేసరికి ఆయనకు మతిపోయినట్లు అయింది. అంతా అర్థం చేసుకుని మామూలుగా మాట్లాడడానికాయనకు కొంతసేపు పట్టింది.

"నా ఇంట్లో వున్నది బ్లాక్ మనీ కాదు. దొంగలనుంచి రక్షించుకోవడం కోసమే నేను రహస్యపుటరను వాడుకుంటున్నాను. ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంటు వాళ్ళకు నా డబ్బు వివరాలన్నీ తెలుసును. ఎప్పుడో అవసరముస్తుందో తెలియక ఇంట్లో ఎక్కువ డబ్బు వుంచుకుంటాను. అంత డబ్బుకు రక్షణ చాలా అవసరం కాబట్టి ఓ కాపలావాడిని వుంచుకున్నాను. అందరికీ తెలిసేలా వుంటే వాడిని మోసం చేయడానికి ప్రయత్నాలు జరుగుతాయి కాబట్టి — కాపలావాడి విషయం రహస్యంగా వుంచాను. ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ దొంగతనం చేసినవాడు సామాన్యుడు కాడు" అన్నాడు విశ్వేశ్వర్రావు.

"అవును. వాడు సామాన్యుడు కాడు. వాడు గురువులు" అన్నాడు రఘునాథ్—"మీ ఇంట్లో జరిగిన దొంగతనం గురించీ, హత్యగురించీ ఒకరోజు ఆలస్యంగా విచారిద్దాం. ముందుగా గురువుల్ని పట్టుకోవాలి. అంతవరకూ ఈ విషయాన్ని కాస్త గోప్యంగా వుంచాలి."

"అలాగే" — అన్నాడు విశ్వేశ్వర్రావో క్షణం ఆలోచించి.

పోలీసు బలగం ఒకరి తర్వాత ఒకరుగా వీలైనంత రహస్యంగా రంగారావు చెప్పిన చోట చేరుకున్నారు. అందరూ చెట్లమాటున దాగున్నారు. ఏ క్షణంలోనైనా గురువులు రావచ్చునని ఎదురు చూస్తున్నారు.

ఎదురుగా జోడు పిస్తోళ్ళతో నిలబడ్డ ప్రతాప్‌ని గురువులు ఎలా చంపాడో రంగారావు ద్వారా విన్న రఘునాథ్‌కు గురువులును తలచుకుంటే వళ్ళంతా చెమటలు పడుతున్నాయి. అతను బైనాక్యులర్స్‌తో పరిసరాలను పరికిస్తూ మాటిమాటికీ తన బలగాన్ని హెచ్చరిస్తున్నాడు.

సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో రోడ్డుమీద నుంచి తోటవైపుకు తిరిగిన మనిషి ఒకడు రఘునాథ్‌కు బైనాక్యులర్స్‌లో కనిపించాడు.

"అందరూ సిద్ధంగా వుండండి. పూర్తి నిశ్శబ్దం. గురువులు వస్తున్నాడు" అంటూ అందర్నీ హెచ్చరించాడు రఘునాథ్.

అంతా ఊపిరి బిగబట్టారు.

కాసేపటికి ఆ తోట మధ్యకు నెమ్మదిగా నడుస్తూ గురువులు వచ్చాడు. వాడు అనుమానంగా చుట్టూ చూస్తున్నాడు.

రఘునాథ్ ఆశ్చర్యంగా గురువులు వంక చూస్తున్నాడు. అదే అతను గురువులును మొదటిసారిగా చూడడం. గురువులు రూపం రఘునాథ్ ఆలోచనలకు భిన్నంగా వుంది.

గురువులు చూడ్డానికి నాజూగ్గా వున్నాడు. ముఖం కరుగ్గా లేదు. సరిగదా అందంగా వుంది. చూపుల్లో కొద్దిపాటి కర్కశత్వం లేకపోలేదు. మనిషిని చూడగానే సంస్కారవంతుడిలా కనబడతాడు. వయసు పాతిక్కి ముప్పైకీ మధ్యలో వున్నట్లు అనిపిస్తుంది.

గురువులు తను బ్రీఫ్ కేసు పాతిపెట్టిన చోటుకు వెళ్ళాడు. అక్కడ గుర్తుగానే వుంది. జేబులోంచి ఓ చిన్న గునపంలాంటి వస్తువుతీసి అక్కడ త్వవ్వసాగాడు. తవ్వకం సులువుగానే వుంది. కొద్ది నిమిషాల్లోనే వాడు అక్కణ్నుంచి బ్రీఫ్ కేసు తీశాడు. ఓ క్షణం ఆలోచించి కత్తినికూడా బయటకు తీసి నడుములో దోపుకున్నాడు.

ఉన్నట్లుండి గురువులు పైన దీపపు కాంతి పడింది. గురువులు కంగారుగా అటూ ఇటూ చూశాడు. చెట్ల చాటునుంచి పోలీసులు ముందుకు వచ్చారు.

అందరి చేతుల్లోనూ తుపాకులున్నాయి. ఆ తుపాకులు గురువులువైపే గురిపెట్టబడి వున్నాయి.

చుట్టూ చూశాడు గురువులు. వలయాకారంలో తనను చుట్టుముట్టారు పోలీసులు.

"మిస్టర్ గురువులూ! కదలడానికి ప్రయత్నించేస్తే శరీరం తూట్లుబడిపోతుంది. చేతులెత్తి నిలబడు..." అన్నాడు రఘునాథ్.

గురువులు ముఖంలో దెబ్బతిన్న అనుభూతి కనబడుతోంది.ఇదెలా జరిగిందన్న ఆశ్చర్యంకూడా అతని కళ్ళలో స్పష్టంగా కనబడుతోంది. ఏదో ఆలోచిస్తూ అతను చేతులు పైకి ఎత్తాడు.

అతని చూపులు పోలీసులమీదా వారి చేతుల్లోని తుపాకులమీదా లేవు. ఆ పోలీసుల వెనుక ఏమున్నదా అని పరీక్షిస్తున్నాయి. ఆ కళ్ళలో ఇంకా ఆశ వుంది.

* * *

రంగారావు తన ననుసరించి వచ్చినట్లు గురువులుకు తెలియదు. వాడు రైల్వేస్టేషన్లో టికెట్ తీసుకున్నాక అక్కణ్నుంచి తిన్నగా తన బసకు వెళ్ళాడు. వాడి బస అజంతా లాడ్జిలో.

అజంతా లాడ్జిలో ఇరవై ఏడో నంబరు గదిలో వాడూ ఇంకో మనిషీ వుంటున్నారు. ఆ మనిషి పురుష దుస్తుల్లో, పురుష వేషంలో వున్నప్పటికీ ఒక స్త్రీ! ఆమె పేరు ఈశ్వరి.

ఈశ్వరికి పదహారో యేట పెళ్ళయింది. పద్దెనిమిదో యేట భర్త పోయాడు. వేరే బంధువులెవ్వరూ లేనందున ఆమె తన అక్క ఇంట్లో వుంటోంది. ఈశ్వరి ఒంటరితనాన్నీ, అసహాయతనూ ఆధారం చేసుకుని, ఆమె బావ ఆమెగురించి విశ్వప్రయత్నాలు చేస్తున్నాడు. అక్కకంటే అందంగా వుంటుంది ఈశ్వరి.

తన భర్త ఈశ్వరి గురించి చేస్తున్న ప్రయత్నాలు ఈశ్వరి అక్కకు తెలుసును. కానీ ఆమె భర్తనేమీ చేయలేక తన అక్కసునంతా చెల్లెలిమీద వెళ్ళబుచ్చుకునేది. తన తప్పేమీ లేదని ఈశ్వరి ఎంత చెప్పినా వినిపించుకునేది కాదు.

తానెంత ప్రయత్నించినా ఈశ్వరి లొంగలేదని ఆమె బావకూడా ఆమె అంటే మంటగా వుంది. ఈశ్వరి ఆ ఇంట్లో అనుభవిస్తున్న మానసిక వేదన ఆ భగవంతుడికే తెలియాలి. వేరే దారిలేక ఎలాగో ఆమె అన్ని బాధలూ సహిస్తోంది.

ఒక రోజున గురువులు ఆ యింట్లో దొంగతనానికి ప్రవేశించాడు. వాడు తన పని తాను చేసుకుందామనుకుంటూండగా ఏదో అలికిడయింది. వాడు బీరువా చాటుకు తప్పుకున్నాడు.

ఈశ్వరి బావ ఈశ్వరికోసం వచ్చాడు. నిద్ర పోతున్న ఈశ్వరిని లేపాడు. ఈశ్వరి తొట్రుపడుతూ లేచింది. మత్తువిడి బావకోరిక విన్నాక —"ఈ యింట్లో వుంటూ అక్కకు ద్రోహం చేయలేను. నా జోలికి రాకు..." అందామె.

(సశేషం) ★